క్లుప్తంగా

పుస్తక పఠనం అలవాటు చేసుకోవాలి



పుస్తక పఠనంపై యువతకు అవగాహన కల్పిస్తున్న రమణ

చీపురుపల్లి: పుస్తక పఠనంతో విజ్ఞానం, ఏకాగ్రత పెరుగుతుందని, ప్రతి ఒక్కరూ పుస్తక పఠనం చేయడం అలవాటుగా మార్చుకోవాలని ఆశయ రూరల్ లైబ్రరీ సంస్థ అధ్యక్షుడు రెడ్డి రమణ కోరారు. స్థానిక జీవీ ఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో పరుగు, తదితర అంశాల్లో శిక్షణ పొందుతున్న యువతకు సంచార గ్రంథాలయ సేవలను ఆదివారం అందుబాటులోకి తీసుకెళ్లారు. యువతకు పుస్తకాలు పంపిణీ చేశారు. అనంతరం మాట్లాడుతూ డిజిటల్ ప్రపంచంలో పుస్తక పఠనంపై రోజురోజుకీ శ్రద్ధ తగ్గిపో తోంద న్నారు. పుస్తక పఠనం ద్వారా జ్ఞానం, పద సంపద, ఆలోచన ధోరణి పెరుగుతుందన్నారు.

సమాచార హక్కుచట్టంపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న సమాచార హక్కుచట్టం జిల్లా సమన్వయ కమిటీ సభ్యుడు సూర్యారావు

శృంగవరపుకోట: సమాచార హక్కు చట్టంపై యువత విస్తృతంగా ప్రచారం చేయాలని ఆ చట్టం జిల్లా సమన్వయ కమిటీ సభ్యులు డి.సూర్యారావు కోరారు. సమాచార హక్కు చట్టం తీసుకొచ్చి ఈనెల 12వ తేదీ నాటికి 19 ఏళ్లు పూర్తవుతున్న సందర్భంగా స్థానిక శాఖా గ్రంథాలయంలో ఆదివారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈసందర్భంగా సూర్యారావు సమాచార హక్కు చట్టం ముఖ్య ఉద్దేశం, లక్ష్యాలు, సాధించిన విజయాలను పాఠకులు, యువకులకు వివరించారు. లైబ్రేరియన్ డి.శ్రీధర్ పాల్గొన్నారు.


పరామర్శ



అరుణ కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న మంత్రి శ్రీనివాస్

గజపతినగరం: నియోజకవర్గ జనసేన నాయకురాలు, మాజీమంత్రి పడాల అరుణ కుమారుడు శరత్‌చంద్ర ఇటీవల మృతి చెందారు. రాష్ట్ర సూక్ష్మ, చిన్నమధ్య తరహా పరిశ్రమలు,సెర్ప్, ప్రవాసాంధ్రుల సాధికారత శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ ఆదివారం గజపతినగరంలో పడాల అరుణ కుటుంబ సభ్యులను పరామర్శించా రు.శరత్ చంద్ర మృతికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. పరామర్శించిన వారిలో మాజీ జెడ్పీటీసీ మక్కువ శ్రీధర్, టీడీపీ నాయకులు పి.వి.వి.గోపాలరాజు, బుద్దరాజు శ్రీరామ్, ఎం.జగన్,ఎం.లక్ష్మునాయుడు ఉన్నారు.

భోజన పథకం నిర్వహణకు స్టవ్ వితరణ



వంట నిర్వాహకులకు స్టవ్ అందిస్తున్న ఉపాధ్యాయుడు రవిశంకర్

వేపాడ: సోంపురం ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకం వంటల నిర్వహణ కోసం ఆ పాఠశాల గణిత ఉపాధ్యాయుడు రవిశంకర్ గ్యాస్ స్టవ్‌ను వంట నిర్వాహకులకు ఆదివారం అందజేశారు. పాఠశాలలో వంటలకు వినియోగించే స్టవ్ పూర్తిగా పాడైపోవడంతో నిర్వాహకులు ఇబ్బందులు పడుతు న్నారు. ఉపాధ్యాయుడు రవిశంకర్ స్పందించి తన సొంత నిధులతో స్టవ్ కొనుగోలుజేసి అందజేశారు.

హ్యాండ్ బోరుకు మరమ్మతులు



దబ్బిరాజుపేట శ్మశానవాటికలో వినియోగంలోకి వచ్చిన హ్యాండ్ బోరు

వేపాడ: మండలంలో దబ్బిరాజుపేట శ్మశానవాటికలో హ్యాండ్ బోరుకు మరమ్మతులు చేసి వినియోగంలోకి తెచ్చామని సర్పంచ్ దందుపాటి ముత్యాలమ్మ ఆదివారం తెలిపారు. బోరు పైపులు పూర్తిగా తుప్పుపట్టి పాడైపోవడంతో శ్మశానవాటికలో అంత్యక్రియలకు నీరు అందుబాటులో లేక గ్రామస్తులు ఇబ్బందులు పడేవారు. సర్పంచ్ స్పందించి పంచాయతీ నిధులతో బోరుకు పైపులు, హ్యాండిల్ ఇతర కొత్త పరికరాలు అమర్చి, ప్లాట్ ఫామ్ నిర్మించి బోరును వినియోగంలోకి తీసుకువచ్చారు.

వరిలో తెగుళ్ల ఉధృతి

- వరి పంట దిగుబడులపై అన్నదాతల ఆందోళన
- అధిక ఉష్ణోగ్రతల ప్రభావంతో పంటను ఆశిస్తున్న తెగుళ్లు
- సకాలంలో నివారణ చర్యలు చేపట్టాలని వ్యవసాయ అధికారుల సూచన



బొండపల్లిలో వరి పంటకు పురుగు మందు పిచికారీ చేస్తున్న రైతు

బొండపల్లి: ఈ ఏడాది ఖరీఫ్ వరి పంట దిగుబడులపై రైతులు ఆందోళన చెందుతున్నారు. అధిక ఉష్ణోగ్రతల ప్రభావంతో పంటలో తెగుళ్ల ఉధృతి, చీడపీడల సమస్య పెరిగిపోతుంది. నాట్లు ఆలస్యం కావడం, ముదిరిన నారుతో ఉభాలు చేయడం కూడా తెగుళ్లు ఆశించడానికి ఓ కారణమని రైతులు చెబుతున్నారు. గజపతినగరం వ్యవసాయశాఖ సబ్ డివిజన్ పరిధి గజపతిన గరం, బొండపల్లి, దత్తిరాజేరు, మెంటాడ మండలాల్లో ఏటా ఖరీఫ్ వరి నాట్లు జూలై నెల రెండో వారానికే ప్రారంభమై ఆగస్టు నెలాఖరు నాటికి దాదాపు పూర్తయ్యేవి. ఈఏడాది సకాలంలో వర్షాలు కురవక పోవడంతో సెప్టెంబర్ మొదటి వారం వరకు వరినాట్లు వేశారు. బోరుబావులు ఉన్న రైతులు మాత్రమే సమయానికి నాట్లు వేయగలిగారు. గజపతినగరం సబ్ డివిజన్ పరిధిలో వరి సాదారణ సాగు విస్తీర్ణం 14వేల హెక్టార్లు కాగా 13,500 హెక్టార్లలో నాట్లు వేశారు. 1121 రకం వరిని 10 వేల హెక్టార్లలో, స్వర్ణ, ఆర్‌జీఎల్, సాంబ మసూరి, తదితర రకాలను 3,500 హెక్టార్లలో సాగు చేస్తున్నారు. జూలైలో నాట్లు వేసిన చోట పంట చిరుపొట్ట దశకు చేరుకుంది. ఆలస్యంగా నాట్లు వేసిన చోట ఇంకా పంట పొట్టకట్టలేదు. కొద్ది రోజులుగా ఎండల తీవ్రత పెరగడంతో పంటను విపరీతంగా తెగుళ్లు ఆశిస్తున్నాయి. రైతులు సకాలంలో తెగుళ్ల నివారణ చర్యలు చేపట్టకుంటే దిగుబడిపై తీవ్ర ప్రభావం ఉంటుందని వ్యవసాయ శాఖ అధికారులు హెచ్చరిస్తున్నారు. ప్రధానంగా పొడ తెగులు, ఆకుముడత, ఎండాకు తెగులు, అగ్గి తెగులు పంటను ఆశిస్తున్నాయి. రైతులు అప్రమత్తంగా ఉంటూ సకాలంలో తెగుళ్లను గుర్తించి నివారణ చర్యలు చేపట్టాలని వ్యవసాయ అధికారులు సూచిస్తున్నారు.



పొడతెగులు ఆశించడంతో వరి ఆకులపై ఏర్పడిన బూడిద రంగు మచ్చలు

ఆకుముడత నివారణ చర్యలు

అక్టోబర్ నెల నుంచి జనవరి మధ్య పంటలో ఆకుముడత తెగులు ఉధృతి ఎక్కువగా ఉంటుంది. లద్దె పురుగు వరి పైరు రెండు ఆకులు మధ్యలో గొట్టంలా చేసి మధ్య భాగాన్ని తినేస్తుంది. దీనినే నాము తెగులు అని కూడా అంటారు. నివారణకు ఎసిఫేట్ 1.5 గ్రాములు కానీ, కార్టాఫ్ హైడ్రోక్లోరైడ్ 50 డబ్ల్యూపీ 2.0 గ్రాములు కానీ, క్లోరాంట్రినిప్రోల్ 0.3 ఎంఎల్‌ను లీటర్ నీటికి కలిపి పిచికారీ చేసుకోవాలి. కార్టాఫ్ హైడ్రోక్లోరైడ్ 4జీ గుళికలను ఇసుకలో కలిపి ఎకరానికి 8 కిలోల చొప్పున పైరుకు చల్లాలి.



ఆకుముడత తెగులు ఆశించడంతో ఆకును తినేస్తున్న లద్దె పురుగు

పొడ తెగులు నివారణ చర్యలు

ముదురు గోధుమ రంగు నల్లని మచ్చలు పైరు అంతా ఉండడంతో పాటు, ఆకులపై బూడిద రంగు మచ్చలు ఏర్పడి పంట పూర్తిగా ఎండిపోతుంది. అధిక ఉష్ణోగ్రత, అధిక నత్రజని వినియోగంతో పాటు, అధిక తేమ వల్ల పంటను ఈ తెగులు ఆశిస్తుంది. నివారణకు హెక్సాకొనజోల్ 0.2 మిల్లీ లీటర్లు కానీ, ప్రొపికొన జోల్ 0.1మిల్లీ లీటర్లు కానీ, వాలిడామైసిన్ 2 మిల్లీ లీటర్లు లీటర్ నీటిలో కలిపి 15 రోజుల వ్యవధిలో రెండు సార్లు పిచికారీ చేసుకోవాలి.

యూరియా వినియోగాన్ని తగ్గించాలి



రైతులు వ్యవసాయ శాఖ అధికారులు సిఫార్సు చేసిన మేరకు వరి పంటకు రెండు విడతల్లో మాత్రమే యూరియా వేయాలి. అధిక మొత్తంలో యూరియా వేయడం వల్ల పంట పూర్తిగా పచ్చదనంగా మారి, పంటను పురుగులు ఆకర్షించి తెగుళ్ల ఉధృత్తికి కారణమవుతుంది. పొలం గట్లపై గడ్డితో పాటు కలుపు మొక్కలు లేకుండా చూసుకోవాలి.మందులను పిచికారీ చేసేటప్పుడు పొలంలో నీరు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. అధికారులు సూచనల మేరకు తెగుళ్ల నివారణకు పురుగు మందులను పిచికారీ చేయాలి. – కె.మహరాజన్, ఏడీఏ, గజపతినగరం సబ్ డివిజన్

ఎండాకు తెగులు నివారణ చర్యలు

ఎండల తీవ్రత అధికంగా ఉండడం వల్ల , ఆలస్యంగా నాట్లు వేసిన ప్రాంతాల్లో పంటను ఈ తెగులు ఆశిస్తోంది. ఈ తెగులు ఆశించిన పైరులో ఆకుల అంచుల వెంబడి, మధ్యలోని ఈనెలు పసుపు రంగులోకి మారి పూర్తిగా ఎండిపోతాయి. నివారణకు కాపర్ ఆక్సీక్లోరైడ్ మందు 30 గ్రాములు, స్ట్రెప్టోసైక్లిన్ సల్ఫేట్ పొడి మందు 2 గ్రాములను 10 లీటర్ల నీటిలో కలిపి పిచికారీ చేసుకోవాలి. అలాగే మల్టికే(13–0–45)ను ఎకరానికి కిలో పిచికారీ చేసుకోవాలి.

ఆ కాలనీలకు దారేది...?

- ఆర్‌ఓబీ నిర్మాణంతో కొత్తఅగ్రహారం, రిక్షాకాలనీకి ఉత్పన్నమైన రోడ్డు సమస్య
- 15 అడుగుల సర్వీస్ రోడ్డు ఏర్పాటు చేయాలని డిమాండ్



ఆక్రమణలు తొలగించకుండా ఆర్‌ఓబీ పనులు చేపడుతున్న స్థలం ఇదే



సర్వీస్ రోడ్ ఏర్పాటు చేయాలని ఆర్‌ఓబీ పనులు జరుగుతున్న చోట రిక్షాకాలనీ వాసుల నిరసన (ఫైల్)

చీపురుపల్లి: పట్టణంలోని రాజాం రోడ్డులో నిర్మిస్తున్న రైల్వే ఓవర్ బ్రిడ్జి(ఆర్‌ఓబీ) అందరికీ అవసరమే. చీపురుపల్లితో పాటు శ్రీకాకుళం జిల్లాలకు ప్రయాణాలు సాగించే వారికి ఆర్‌ఓబీ అను సంధానంగా నిలుస్తోంది. అయితే ఈ నిర్మాణం పూర్తయితే తమ సంగతి ఏంటో చెప్పాలని, కనీసం సర్వీస్ రోడ్డు కూడా లేకపోతే తాము రాకపోకలు సాగించేదెలా అని పట్టణంలోని రిక్షా కాలనీ, కొత్త అగ్రహారం వాసులు అధికారులు, పాలకులను ప్రశ్నిస్తున్నారు. నడిచి వెళ్లేందుకు దారి ఇవ్వడం వల్ల ఏం ప్రయోజనమని, కాలనీల్లోకి వాహనాలు వెళ్లే వీలు లేకపోతే ఎలా అని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆర్‌ఓబీ నిర్మాణంతో ఎంతో మందికి మేలు జరుగుతున్నప్పటికీ రిక్షాకాలనీ, కొత్తఅగ్రహారం వాసులకు మాత్రం తలనొప్పిగా మారింది. పట్టణంలోని గాంధీ బొమ్మ జంక్షన్ నుంచి రాజాం రోడ్‌లో నుంచి కొత్తఅగ్రహారం మీదుగా రిక్షాకాలనీకు వెళ్లాల్సి ఉంటుంది. ఈ కాలనీకి వెళ్లే దారిని దాటుకుని ఆర్‌ఓబీ నిర్మిస్తున్నారు. ఈపనులు పూర్త యితే రిక్షాకాలనీకి రాకపోకలు నిలిచిపోతాయి. ఎట్టి పరిస్థితుల్లోనూ 15 అడుగుల సర్వీస్ రోడ్డు విడిచిపెడితే తప్ప పనులు జరగనివ్వబోమంటూ ఇదివరకే కాలనీ వాసులు అంతా ఆర్‌ఓబీ నిర్మాణ ప్రాంతంలో నిరసన తెలిపారు. రైల్వే, ఆర్‌అండ్‌బీ అధికారులు సర్వీస్ రోడ్ ఏర్పాటు చేస్తామని చెబుతున్నప్పటికీ కాలనీ వాసులు మాత్రం 15 అడుగులకు తగ్గకుండా రోడ్డుకు స్థలం ఉంచాలని డిమాండ్ చేస్తున్నారు. అత్యవసర సమయాల్లో కాలనీలోకి 108, అగ్నిమాపక వాహనాలు రావాలంటే 15 అడుగుల రోడ్డు లేకపోతే కష్టమని అంటున్నారు. కాలనీ వాసులు రోడ్డు కోసం నిరసన తెలిపి దాదాపు పదిహేను రోజులు కావస్తున్నప్పటికీ ఇంతవరకు సమస్య తేలలేదు.

ఆక్రమణలు తొలగిస్తే....

పట్టణంలోని మెయిన్‌రోడ్ నుంచి రిక్షాకాలనీకి వెళ్లే మార్గం వద్ద ఉన్న ఆర్‌అండ్‌బీ స్థలంలో చాలా కాలం క్రితం కొందరు ఆక్రమణలు జరిపి పక్కా నివాసాలు నిర్మించుకున్నారు. ఈ ఆక్రమ ణలు తొలగించి ఆర్‌ఓబీ నిర్మాణం జరిపితే రిక్షాకాలనీకు సర్వీస్ రోడ్డు సమస్య ఉత్పన్నమయ్యేది కాదు. కానీ రాజకీయ ఒత్తిళ్లతో ఆక్రమణలు తొలగించకుండానే ఆర్‌ఓబీ నిర్మాణ పనులు చేస్తుండడంతో కాలనీకి సర్వీస్ రోడ్డు లేకుండా పోతోందని కాలనీ వాసుల్లో కొంతమంది ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇక్కడి ఆక్రమణలను ఎమ్మెల్యే కిమిడి కళా వెంకటరావు రెండు నెలల క్రితం పరిశీలించి ఆక్రమణల్లో కనీసం సగభాగమైనా ఆక్రమణదారులు వదులుకోవాలని చెప్పారు. ఆ తర్వాత ఏం జరిగిందో గానీ ఆక్రమణల ఊసెత్తకుండా పనులు ముందుకు కొనసాగించారు.

శాలివాహన కులస్తులను ఆదుకోవాలి



గాయపడిన చిన్నారి వైద్యఖర్చుల నిమిత్తం చిన్నారి తల్లికి నగదు అందజేస్తున్న శాలివాహన సంఘ సభ్యులు

లక్కవరపుకోట: శాలివాహన కులస్తులను ప్రభుత్వం ఆర్థికంగా ఆదుకోవాలని ఆ కులస్తుల ఉత్తరాంధ్ర జిల్లాల సంఘం అధ్యక్షుడు మానేపల్లి జేజీబాబు కోరారు. మండ లంలోని గోల్డ్ స్టార్ జంక్షన్ వద్ద ఓ కల్యాణ మండపంలో ఉత్తరాంధ్ర జిల్లాల శాలివాహన కులస్తుల సమావేశం ఆదివారం నిర్వహిం చారు.ముందుగా సంఘ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అనంతరం జేజీబాబు మాట్లాడుతూ కుమ్మరి కులవృత్తికి మనుగడ లేకపోవడంతో వినాయకుడు, దుర్గాదేవీ అమ్మవారి విగ్రహాలను తయారు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారని, ఈ బొమ్మలకు సరైన ధర లేకపోవడంతో పెట్టుబడి రాక నష్టాలు చవిచూస్తున్నారని అన్నారు. ఈ కుటుంబాలను ప్రభుత్వమే ఆదుకోవాలని కోరారు. అనంతరం రోడ్డుప్రమాదంలో తీవ్రంగా గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న జామి మండల కేంద్రంలోని శాలివాహన కులానికి చెందిన ఓ చిన్నారి చికిత్స కోసం సంఘం తరఫున రూ.30 వేల ఆర్థిక సాయాన్ని చిన్నారి తల్లికి అందజేశారు. కార్యక్రమంలో సంఘ కార్యదర్శి స్వయంవరపు కనకారావు, ఉపాధ్యక్షుడు చిన్నారావు,కోశాధికారి మురళీ తదితరులు పాల్గొన్నారు.

రూ.2.55 లక్షలు పలికిన అమ్మవారి లడ్డూ

లక్కవరపుకోట: దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా మండలంలోని కోనమసివానిపాలెం గ్రామంలో ఏర్పాటు చేసిన మండపం వద్ద భవానీ మాలధారణ భక్తులు శనివారం రాత్రి అమ్మవారి అంబలం పూజ నిర్వహించారు. విశాఖపట్నం,అనకాపల్లి,విజయనగరం జిల్లాల నుంచి భవానీ మాలధారణ భక్తులు హాజరై పూజలు చేశారు. ఈ సందర్భంగా అమ్మవారికి నైవేద్యంగా సమర్పించిన 54 కిలోల లడ్డూను ఉత్సవ కమిటీ సభ్యులు వేలం వేశారు. విశాఖపట్నం జిల్లా, పెందు ర్తి మండలం, పులగానిపాలెం గ్రామానికి చెందిన చక్రి అనే వ్యక్తి వేలంలో రూ.2.55లక్షలకు లడ్డూను దక్కించుకున్నారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు.

ఏరియా ఆస్పత్రి వద్ద ఉద్రిక్తత



మృతుడు నూకరాజు కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న ఎస్‌ఐ నూకరాజు

గజపతినగరం: స్థానిక ఏరియా ఆస్పత్రి వద్ద ఆదివారం ఉద్రిక్తత నెలకొంది. వివరాల్లోకి వెళితే...మండలంలోని తుమికాపల్లి గ్రామానికి చెంది న రాపాక నూకరాజు(60)కు గుండె నొప్పిరావడంతో కుటుంబ సభ్యులు స్థానిక ఏరియా ఆస్పత్రికి తీసుకువచ్చారు. పరిస్థితి విషమించడంతో వైద్యం పొందుతూ ఆయన మృతి చెందారు.వైద్యుల నిర్లక్ష్యం, సకాలంలో వైద్యం అందించకపోవడం వల్లే నూకరాజు చనిపోయాడని ఆయన కుటుంబ సభ్యులు వైద్యులతో వాదనకు దిగారు. అయితే వైద్యులు జగదీష్, వినీత్ మాట్లాడుతూ నూకరాజును ఆస్పత్రికి తీసుకువచ్చిన వెంటనే ప్రథమ చికిత్స చేసి, ఇంజక్షన్ చేశామని, ఈసీజీతో పాటు పీపీఆర్ సేవలు అందించినప్పటికీ పరిస్థితి విషమించడంతో మృతి చెందాడని చెప్పారు. సదరు వ్యక్తికి ముందుగానే బయట కొనుగోలు చేసిన మాత్రలను వేసి ఆస్పత్రికి తీసుకువచ్చారని, వైద్యసేవలందించడంతో తమ నిర్లక్ష్యం ఏమీ లేదని తెలిపారు. మృతుడి బంధువుల ఆందోళనతో ఆస్పత్రి వద్ద పరిస్థితి అదుపుతప్పే అవకాశం ఉందని భావించి ఆస్పత్రి సిబ్బంది స్థానిక పోలీస్ స్టేషన్‌కు సమాచారం అందజేశారు. ఎస్‌ఐ లక్ష్మణరావు, పోలీస్ సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకొని నూకరాజు కుటుంబ సభ్యులకు సర్ది చెప్పి మృత దేహాన్ని గ్రామానికి తరలించే ఏర్పాటు చేశారు.

అధ్వాన రహదారితో అవస్థలు



గుర్ల - విజయనగరం ప్రధాన రహదారిలో ఏర్పడిన గుంతలు

గుర్ల: మండల కేంద్రం నుంచి జిల్లా కేంద్రానికి వెళ్లే ప్రధాన రహదారి గుంతలమయం కావడంతో వాహనచోదకులు, ప్రయాణికులు ఇబ్బందులు పడు తున్నారు. రోడ్డుపై ఎక్కడికక్కడ ఏర్పడిన గుంతల వల్ల తరచూ ద్విచక్ర వాహనచోదకులు ప్రమాదాల బారినపడుతున్నారు. నిత్యం రద్దీగా ఉండే ప్రధాన రహదారిలో పరిస్థితి ఇంత అధ్వానంగా ఉంటే అధికారులు పట్టించుకోకపోవడమేంటని ప్రయాణికులు, వాహనచోదకులు ప్రశ్నిస్తున్నారు. అధికారులు వెంటనే స్పందించి మరమ్మతులు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

సామూహిక కుంకుమార్చనలు



శృంగవరపుకోట: నవదుర్గలకు కుంకుమ పూజ చేస్తున్న మహిళలు



చీపురుపల్లి: అన్నపూర్ణాదేవి అలంకరణలో కనకమహాలక్ష్మి అమ్మవారు

చీపురుపల్లి: పట్టణంలోని కనకమహాలక్ష్మి అమ్మవారి దేవస్థానంలో దేవీ నవరాత్రి ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా అమ్మవారు ఆదివారం అన్నపూర్ణాదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. దేవస్థానంలో సామూహిక కుంకుమ పూజ, ఛండీ హోమం నిర్వహించారు. అనంతరం భక్తులకు దేవస్థానం ఈఓ బి.శ్రీనివాస్ నేతృత్వంలో ప్రసాద వితరణ చేశారు.



చీపురుపల్లి: కుంకుమ పూజలు చేస్తున్న భక్తులు

నవదుర్గ పూజ


శృంగవరపుకోట: శరన్నవరాత్రుల సందర్భంగా స్థానిక పుణ్యగిరి రోడ్డులో ఉన్న ఎస్.కోట గ్రామదేవత ధారగంగమ్మ ఆలయంలో అర్చ కులు రాజగోపాలాచార్యులు ఆధ్వర్యంలో ఆదివారం నవదుర్గ పూజ నిర్వహించారు. దుర్గమ్మ దివ్య అవతారాలైన బాలాత్రిపుర సుంద రి, గాయత్రీదేవి, అన్నపూర్ణాదేవి, మహాలక్ష్మీదేవి, కాత్యాయినీదేవి, లలితాదేవి, సరస్వతీదేవి, దుర్గాదేవి, మహిషాసుర మర్దిని, రాజరాజేశ్వరీ దేవి విగ్రహాలను ఏర్పాటు చేసి కుంకుమ పూజలు, అర్చనలు చేశారు. నవదుర్గలకు ఒక్కో దేవతకి ఒక్కో రకం నైవేద్యంతో పాటు వస్త్రాలు సమర్పించారు. స్థానిక, పలు గ్రామాల నుంచి మహిళలు, భవానీ మాలధారణ భక్తులు హాజరయ్యారు.

రాజరాజేశ్వరీ దేవిని దర్శించుకున్న మంత్రి

బొండపల్లి: శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా దేవుపల్లి గ్రామంలోని రాజరాజేశ్వరీదేవి ఆలయంలో అమ్మవారిని రాష్ట్ర సూక్ష్మ,చిన్నమధ్య తరహా పరిశ్రమలు, సెర్ప్, ప్రవాసాం ధ్రుల సాధికారత శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ ఆదివారం దర్శించుకున్నారు. అర్చకులు దూసి శ్రీధర్ పూర్ణకుంభంతో మంత్రికి స్వాగతం పలికి ఆయనతో ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేయించారు. గజపతినగరం మాజీ జెడ్పీటీసీ మక్కువ శ్రీధర్, టీడీపీ మండల అధ్యక్షుడు కోరాడ కృష్ణ, నాయకులు రాపాక అచ్చంనాయుడు, కెరటాం సర్పంచ్ సంబూరి రాజేష్, సిటికపల్లి సర్పంచ్ నడుపూరి భాస్కరనాయుడు తదితరులు పాల్గొన్నారు.

దీపారాధనలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే

గంట్యాడ: దేవీ నవరాత్రుల సందర్భంగా బుడతానపల్లి గ్రామంలో అమ్మవారి మండపం వద్ద శనివారం రాత్రి ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో దీపారాధన నిర్వహించారు. కార్యక్రమానికి గజపతినగరం మాజీ ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య హాజరయ్యారు. అమ్మవారిని దర్శించుకుని, దీపాలను వెలిగించారు. జెడ్పీటీసీ వర్రి నరసింహమూర్తి, జిల్లా వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ అధ్యక్షుడు వర్రి నరసింహమూర్తి, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు జాగరపు అప్పారావు, సర్పంచ్ అలమండ వాణి, ఎంపీటీసీ వర్రి అర్జునమ్మ, తదితరులు పాల్గొన్నారు.



గంట్యాడ: బుడతానపల్లిలో అమ్మవారి మండపం వద్ద స్థానిక యువతతో మాజీ ఎమ్మెల్యే అప్పలనరసయ్య



బొండపల్లి: రాజరాజేశ్వరీ అమ్మవారికి పూజలు చేస్తున్న మంత్రి శ్రీనివాస్

కొండగుళ్లుకు రోడ్డు సౌకర్యం కల్పించరూ...



ఆకులసీతంపేట నుంచి కొండగుళ్లుకు వెళ్లే దారి

వేపాడ: మండలంలోని ఆకులసీతంపేట గ్రామం నుంచి కొండగుళ్ల బ్రహ్మలింగేశ్వరస్వామి ఆలయానికి అధికారులు రోడ్డు సౌకర్యం కల్పించాలని గ్రామస్తులు కోరుతున్నారు.ఆకులసీతంపేట నుంచి కిలోమీటరు దూరంలో ఉన్న ఆలయానికి రోడ్డు లేకపోవడంతో జగ్గయ్యపేట,గుడివాడ మీదుగా వెళ్లాల్సివస్తోందని గ్రామస్తులు అంటున్నారు. గతంలో మట్టిరోడ్డు పోల్చి వదిలేశారని చెబుతున్నారు. సుమారు 200 ఏళ్ల చరిత్ర కలిగిన ఆలయానికి రోడ్డు సదుపాయం కల్పించకపోవడం సరికాదని అంటున్నారు. అధికారులు, పాలకులు స్పందించి గతంలో పోల్చి వదిలేసిన మట్టిరోడ్డును సీసీ లేదా తారురోడ్డుగా అభివృద్ధి చేయాలని కోరుతున్నారు.

జూదరుల అరెస్ట్

దత్తిరాజేరు: మండలంలోని లింగరాజపురం గ్రామ సమీపంలో ఆదివారం పేకాట ఆడుతున్న ముగ్గురు వ్యక్తులను అరెస్ట్ చేశామని ఎస్.భూర్జవలస ఎస్‌ఐ రాజేష్ తెలిపారు. గ్రామ సమీపంలో పేకాట ఆడుతున్నారని స్థానికులు ఇచ్చిన సమాచారంతో సిబ్బందితో కలిసి వెళ్లి దాడిచేసి ముగ్గురిని పట్టుకున్నామని ఎస్‌ఐ చెప్పారు. నిందితుల నుంచి రూ.4,200 నగదు స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేశామని పేర్కొన్నారు.